క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

నాగులుప్పలపాడు: మండల పరిధిలోని మట్టిగుంట గ్రామంలో దారా అంకయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు దారా పద్మజ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఒంగోలులోని ప్రముఖ ఆస్పత్రులైన కిమ్స్ వైద్యశాల, డాక్టర్ ప్రసాద్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, జీజీహెచ్‌కి చెందిన వైద్యులు పాల్గొని సేవలందించి ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభిస్తారని వెల్లడించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

20, 21 తేదీల్లో క్విజ్, పాటల పోటీలు

ఒంగోలు మెట్రో: ప్రజానాట్యమండలి కళాకారుడు, సంచలన సినీ దర్శకుడు టి.కృష్ణ 37వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 20, 21 తేదీల్లో ఒంగోలు సీవీఎన్ రీడింగ్ రూమ్‌లో క్విజ్, పాటల పోటీలు నిర్వహించనున్నట్లు టీ కృష్ణ మెమోరియల్ కల్చరల్ సొసైటీ కమిటీ సభ్యుడు పీవీఆర్ చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 20వ తేదీ ఉదయం 9 గంటలకు జూనియర్స్ (హైస్కూల్ విద్యార్థులు)కు, అనంతరం సీనియర్స్ (కాలేజీ విద్యార్థులకు)కు క్విజ్ పోటీలు జరుగుతాయన్నారు. 21వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు పాటల పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఈ పోటీల్లో హైస్కూల్, కాలేజీ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు సినీ హీరో గోపీచంద్ ఆర్థికసాయం కూడా అందజేస్తారన్నారు. విజేతలకు 21వ తేదీ సాయంత్రం నిర్వహించే బహిరంగ సభలో టి.కృష్ణ తనయుడు, సినీ హీరో గోపీచంద్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జీవో ప్రకారం జీతాలివ్వాలి

ఒంగోలు టౌన్: రిమ్స్ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం రెండో రోజు కూడా రిమ్స్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు సర్దార్, ఉపాధ్యక్షుడు పీవీఆర్ చౌదరి పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 41 మందికి ఉద్యోగాలు

ఒంగోలు: తమ కాలేజీలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 41 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని శ్రీనాగార్జున డిగ్రీ కాలేజీ చైర్మన్ వి.రాంప్రసాద్ తెలిపారు. శనివారం లక్నోకు చెందిన మల్టీనేషనల్ కంపెనీ అయిన పైఇన్ఫోకాం లిమిటెడ్ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. మొత్తం 425 మంది హాజరవగా, వారిలో 41 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఈ ప్రక్రియను కాలేజీ ప్రిన్సిపాల్ సి.వసంతలక్ష్మి, పై ఇన్ఫోకాం ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు విజయ్‌కుమార్ జైశ్వాల్, సోనాలి పటేల్, కాలేజీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ యోగయ్య చౌదరి నిర్వహించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ డిగ్రీ ఉత్తీర్ణులైనవారికి రూ.3.50 లక్షలు, ఎంబీఏ క్వాలిఫికేషన్ ఉన్నవారికి రూ.7 లక్షలు వార్షిక వేతనం లభిస్తుందన్నారు. ఇటువంటి మరికొన్ని క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తెలంగాణ మద్యం స్వాధీనం



సెబ్ అధికారులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

కురిచేడు: మండలంలోని ఆవులమంద గ్రామానికి చెందిన గొట్టిపాటి రామకృష్ణ అనే వ్యక్తి వద్ద తెలంగాణకు చెందిన మద్యం బాటిళ్లను సెబ్ ఇన్‌స్పెక్టర్ సుందరరామయ్య తన సిబ్బందితో వెళ్లి శనివారం స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన రాయల్ స్టాగ్ విస్కీ 2 లీటర్ల బాటిళ్లు 5, మాన్‌సన్ హౌస్ 750 ఎంఎల్ ఒకటి, 375 యంఎల్ ఒకటి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

చెంచులకు దుప్పట్లు పంపిణీ

పెద్దదోర్నాల: దివంగతుడైన తన కుమారుడు గుమ్మా ధీరజ్ సాయికృష్ణ ఏడో జయంతిని పురస్కరించుకొని ఎంపీపీ గుమ్మా పద్మజ, వైఎస్సార్ సీపీ నాయకుడు గుమ్మా యల్లేష్‌లు చెంచు గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. శనివారం మండల పరిధిలోని చింతల, తుమ్మలబైలు గిరిజన గూడేల్లో జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో వారు పాల్గొని 100 మంది గిరిజనులకు దుప్పట్లతో పాటు, ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుమ్మా యల్లేష్ మాట్లాడుతూ చిన్న వయసులోనే తమను విడిచి వెళ్లిన ధీరజ్ శ్రీ కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం



కేశవస్వామిపేటలోని విజయదుర్గాదేవి ఆలయం



విద్యుత్ దీపాలంకరణలో గంటాపాలెం పార్వతమ్మ దేవాలయం



విద్యుత్ వెలుగుల్లో అమ్మవారి దేవాలయం



కేశవస్వామిపేటలోని కనకదుర్గమ్మ ఆలయం

- నగరంలో ముస్తాబైన ఆలయాలు
- నవరాత్రి మహోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- రోజుకో అలంకరణలో దర్శనమివ్వనున్న అమ్మవార్లు

ఒంగోలు మెట్రో: దసరా పండుగ సందర్భంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు నగరంలోని దేవాలయాలు ముస్తాబయ్యాయి. అమ్మవారి ఆలయాలన్నీ విద్యుత్ దీపాల వెలుగులతో కాంతులు విరజిమ్ముతున్నాయి. ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నవరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. స్థానిక బాలాజీరావుపేటలోని శ్రీ కనకదుర్గమ్మ దేవాలయం, రంగారాయుడు చెరువు వద్ద ఉన్న కంచి కామాక్షమ్మ దేవాలయం, కేశవస్వామిపేటలోని విజయదుర్గ అమ్మవారి ఆలయం, గంటాపాలెంలోని పార్వతమ్మ దేవాలయం, గద్దలగుంటలోని రాజరాజేశ్వరి దేవాలయం, సమతానగర్లోని దుర్గా మల్లేశ్వరి దేవాలయం, లాయర్‌పేట శిరిడీ సాయిబాబా మందిరం, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు, కేశవస్వామిపేటలోని ప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానంలో కొలువైయున్న రాజ్యలక్ష్మి అమ్మవారికి, కొత్తపట్నం బస్టాండ్ వద్ద గల శ్రీ మహాలక్ష్మీ దేవస్థానాలను దసరా మహోత్సవాలకు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి శ్రీగిరిలో బ్రహ్మోత్సవాలు...

ఒంగోలులో కొండమీద గల శ్రీగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలను ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు వెల్లడించారు. ఈ నెల 15 సాయంత్రం ఏడు గంటలకు కలశ స్థాపనతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని, ప్రతి రోజూ శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారని వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని వారు కోరారు.

బీచ్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న జయరావు, గోపి, గ్రామస్తులు

గుండమాల (కొత్తపట్నం): గుండమాలలో బీచ్ రోడ్డు నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. సర్పంచ్ కారాని జయరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మోటుమాల సర్పంచ్ కోడూరి గోపి, పురిణి బ్రహ్మారెడ్డి, శ్రీరాములు, పోలయ్య, రామారావు, కాంట్రాక్టర్ దొడ్ల రాజగోపాల్‌రెడ్డి పాల్గొని టెంకాయలు కొట్టారు. అనంతరం పొక్లెయిన్‌తో చదును చేయించి డోజర్‌తో లెవలింగ్ చేశారు. టిప్పర్లతో బంకమట్టి తోలుతున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని బీచ్‌కు గ్రావెల్ రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరారు. బాలినేని స్పందించి జిల్లా పరిషత్ నిధులు రూ.20 లక్షలు మంజూరు చేయించారు. వెంటనే ఎస్టిమేషన్ వేయించి సేక్షన్ చేయించారు. భూమి పూజ చేయించి పనులు ప్రారంభించారు. పొలాలకు ఎరువులు, ధాన్యం రవాణా చేసుకోవడానికి, చేపల వేటకు వెళ్లడానికి ఈ రోడ్డు బాగా ఉపయోగపడుతుందని గ్రామస్తులు తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ రోడ్డు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఎమ్మెల్యే బాలినేనిని అడిగిన వెంటనే స్పందించారని కృతజ్ఞతలు తెలిపారు. వారం రోజుల్లో రోడ్డు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాములు, కోడూరి వెంకారెడ్డి, శివకృష్ణ, రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిక్షణతో నైపుణ్యాలు సాధించాలి



శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న కళాశాల యాజమాన్యం, సిబ్బంది

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులు శిక్షణతో నైపుణ్యాలు సాధించి మంచి ఉద్యోగాలకు ఎంపికవ్వాలని రైజ్ కళాశాల చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్ పిలుపునిచ్చారు. స్థానిక రైజ్ కళాశాలలో ఈసీఈ నాలుగు, మూడు సంవత్సరాల విద్యార్థులకు శనివారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాలుగో సంవత్సరం విద్యార్థులకు కేఆర్ఐఎస్‌వైడీఏ సీనియర్ ప్రొడక్ట్ ఇంజినీర్ వంశీకృష్ణ ఆటోమేటిక్‌గా మోటార్ నియంత్రణ, హార్ట్‌బీట్ కొలిచే విధానం, గృహోపకరణాలను ఆటోమేటిగ్గా నియంత్రించడం వంటి టెక్నాలజీపై అవగాహన కల్పించారు. తృతీయ సంవత్సరం విద్యార్థులకు గుంటూరు ఎన్‌టీసీఎస్ నుంచి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఎన్.నరేష్ భూమిలో తేమ శాతం, గ్యాస్ లీకేజీని సెన్సార్ ద్వారా కొలవడం, వీధి దీపాలు వెలిగించటం లాంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, డైరెక్టర్ ఏవీ భాస్కర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు యూనివర్సిటీ సిలబస్‌తో పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చక్కగా ఉపయోగపడతాయని చెప్పారు.

బౌద్ధమతం ఎంతో గొప్పది



ర్యాలీ నిర్వహిస్తున్న జై భీమ్ నాయకులు

ఒంగోలు సెంట్రల్: బౌద్ధమతం ఎంతో గొప్పదని, ఆ విషయాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆనాడే చాటిచెప్పారని పలువురు వక్తలు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధమతం స్వీకరించిన రోజు సందర్భంగా జై భీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నగరంలో ర్యాలీ నిర్వహించి బౌద్ధమతం గొప్పదనాన్ని వివరించారు. 1956 అక్టోబర్ 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నాగపూర్‌లో ఐదు లక్షల మందితో బౌద్ధమతం స్వీకరించి బౌద్ధిజం గొప్పతనాన్ని చాటిచెప్పారని జై భీమ్ ఫౌండేషన్ చైర్మన్ భీమ్ నాగేశ్వరరావు తెలిపారు. నగరంలోని అంబేడ్కర్ విగ్రహాలకు, కాన్షీరామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకటరావు, ఏకే విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.హర్షప్రీతమ్‌దేవ్, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చావలి సుధాకర్, సుబ్బారావు, రాజా, హరిబాబు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు పేస్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటాలని పేస్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ పిలుపునిచ్చారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు పేస్ కళాశాల విద్యార్థులు అజీస్‌వలి, దినేష్‌తేజ ఎంపికవగా, శనివారం వారిని కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ వీరాంజనేయులు, ఏఓ రమణబాబు, డీన్ ఆఫ్ ప్లేస్‌మెంట్స్ రూప ఆకేష్, పలు విభాగాల అధిపతులు రవీంద్ర, షరీఫ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా ముందస్తు వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు: దసరా ముందస్తు వేడుకలను స్థానిక ధారావారితోటలోని నారాయణ పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రత్యేక వేషధారణలతో పాల్గొని సంప్రదాయ నృత్యాలు, బొమ్మల కొలువులతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ వేదవతి, ఏజీఎం పెద్దిరెడ్డి, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



కొనకనమిట్ల రామదూతక్షేత్రంలో నందీశ్వరుడికి తైలాభిషేకం

కొనకనమిట్ల: మహాలయ పక్షం చివరి శనివారం సందర్భంగా కొనకనమిట్ల మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు. ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండలో శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూల మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయకాంత్ శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్లలోని రామదూత క్షేత్రంలో నందీశ్వరునికి తైలాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయ వేదపండితులు అకలంకం వెంకటకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఉభయదాతలు నిర్వహించారు.

విశ్వశాంతిని కాంక్షిస్తూ గాయత్రి యజ్ఞం

గిద్దలూరు రూరల్: విశ్వశాంతిని కాంక్షిస్తూ అమావాస్య సందర్భంగా పట్టణంలోని కాశినాయన నగర్‌లోని గాయత్రిమాత ఆలయంలో గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో శనివారం గాయత్రి యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ ధ్యాన మందిరం నిర్వాహకుడు పి.హనుమంతారెడ్డి మాట్లాడుతూ.. గాయత్రి యజ్ఞంతో సకల శుభాలు సంతరించుకుంటాయన్నారు. దేవీశరన వరాత్రుల సందర్భంగా 9 రోజులపాటు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిడతల సాయికల్పనారెడ్డి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి, గాయత్రి పరివార్ సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ జాతీయ అవార్డు గ్రహీతకు మంత్రి అభినందన



నగదు బహుమతి అందచేస్తున్న మంత్రి సురేష్

పుల్లలచెరువు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.నిఖిల్, గైడ్‌టీచర్ ఎస్‌కే మస్తాన్ వలి జాతీయ స్థాయిలో ఇన్‌స్పైర్ అవార్డు పొందినందుకు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ విద్యార్థికి, గైడ్ టీచర్ లకు రూ.10 వేలు బహుమతిగా అందజేసి అభినందించారు. శనివారం మంత్రి కార్యాలయంలో అవార్డు గ్రహీతలను అభినందించి మాట్లాడుతూ మారుమూల ప్రాంతం నుంచి ఇటువంటి ప్రయోగాలు చేసి జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావడం ఎంతో సంతోషం అని, మంచి ఆలోచనలతో ముందుకు సాగి ప్రభుత్వానికి, జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని మంత్రి ఆకాంక్షించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమామహేశ్వరరావు, నియోజకవర్గ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జానీబాష తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరించిన బాలినేని



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు

ఒంగోలు: దసరా సందర్భంగా స్థానిక శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానాల్లో దేవీ నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు ఆవిష్కరించారు. శనివారం ఉదయం స్థానిక బాలినేని నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథం, సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి రజనీకుమారి, సూపర్‌బజార్ డైరెక్టర్ వి.మురళి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 20 కుటుంబాలు చేరిక



కొత్తగా పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

మోటుమాల (కొత్తపట్నం): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్నామని, రాష్ట్రంలో ప్రభుత్వ పరిపాలన బాగుందని, అందుకే వైఎస్సార్ సీపీలో చేరుతున్నామని మోటుమాల గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు తెలిపారు. ఇప్పటి వరకు జనసేన పార్టీలో కొనసాగిన వీరంతా శనివారం రాత్రి ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి బాలినేని ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పురిణి కృష్ణారెడ్డి, పి.సాంబయ్య ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారిలో గంటా వెంకట్రావు, గంటా శ్రీను, నున్నా పవన్‌సాయి, బి.పద్మ, పి.వెంకటేష్, పర్వతిరెడ్డి కొండలు, పర్వతిరెడ్డి బుజ్జి, పి.ఆదిశేషు, నల్లహరి నాగేశ్వరరావు, పసుపులేటి నాగమల్లేశ్వరి, నరహరి రమణమ్మ, పురిణి సుబ్బులు, షేక్ మీరాబీ, పురిణి బాలకోటమ్మ, పాణాల సద్దెమ్మ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మూగ వెంకటేశ్వర్లు, పురిణి రమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఏకేయూ డీన్‌ని సత్కరించిన ఎమ్మెల్సీ



డీన్ వెంకటేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి

ఒంగోలు: ఆంధ్రకేసరి యూనివర్శిటీ డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డిని తూర్పు రాయలసీమ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి శనివారం ఘనంగా సత్కరించారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సందర్భంగా వెంకటేశ్వరరెడ్డిని ఎమ్మెల్సీ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు వెంకట్రావు, అంజిరెడ్డి, శేఖర్, శేషిరెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై విశేషంగా ఖర్చుచేస్తోందని, దానికి ఫలితం రావాలంటే ఉపాధ్యాయ సహకారం ఎంతో అవసరమని ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఏపీ విద్యార్థులు అంతర్జాతీయ వేదికలపై ప్రతిభను ప్రదర్శిస్తున్నారని, అందుకు ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలుపుతున్నామని ఆయన అన్నారు.

రంగభూమి కళాకారులచే నాటక ప్రదర్శన



నాటక ప్రదర్శనలో ఓ సన్నివేశం

ఒంగోలు మెట్రో: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం, ఒంగోలు వారిచే ప్రతినెలా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా 76వ నెల కార్యక్రమాలను శనివారం సాయంత్రం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా రంగభూమి కళాకారుల సంఘ కళాకారులచే శ్రీకృష్ణ రాయబారం (పడక సీను) నాటక ప్రదర్శన జరిగింది. శ్రీనివాసరెడ్డి, మెడికల్ బాబూరావు, చిట్టా వెంకట శివప్రసాద్, భువనగిరి పురుషోత్తం నటించి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. అనంతరం జరిగిన సభకు అధ్యక్షునిగా బేతంశెట్టి హరిబాబు వ్యవహరించి మాట్లాడారు. ఈ నెలలో మరణించిన కొందరు నాటక, సినీ ప్రముఖులను స్మరించుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రముఖ నాటక రచయిత, నటులు, దర్శకులు కడియం శాంతిబాబు గురించి ప్రముఖ నటులు, రచయిత, దర్శకులు ఎల్.శంకర్ మాట్లాడారు. ప్రముఖ సాహితీవేత్త మల్లవరపు రాజేశ్వరరావు గురించి ప్రముఖ పౌరాణిక రంగస్థల నటుడు ఎం.శాంతారావు మాట్లాడారు. జర్నలిస్ట్ మాల్యాద్రి గురించి కళాభిమాని పల్నాటి నాగేశ్వరరావు మాట్లాడారు. అనంతరం శ్వేతా నాట్య అకాడమీ ఒంగోలు గురువు లక్ష్మి శ్వేత ఆధ్వర్యంలో చిన్నారుల భరతనాట్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, కోశాధికారి ధేనువకొండ సుబ్బయ్య, కార్యవర్గ సభ్యులు దిగ్విజయ్ జాలాది మోహన్, వాకా సంజీవరెడ్డి, మాకా ఆంజనేయులు, పాదిలి బాలగురవయ్య తదితరులు పాల్గొన్నారు.